RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | బుధవారం | 03- 04- 2024
సంపుటి : 1 | సంచిక : 300 | పేజీలు : 4 | వెల : 5.00

## ప్రతిభను చాటిన నారాయణ విద్యార్థులు

**కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు**




ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల్లో మా పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచి పోటీ తత్వలో ఎన్నో ర్యాంకులు సాధించిన వారు నారాయణ విద్యార్థులేనని సుచిత్ర బ్రాంచ్ ప్రిన్సిపల్ జే హేమలత అన్నారు. కౌన్సిల్ ఫర్ నర్చరింగ్ అకాడమిక్ పొటెన్షియల్ ఇన్ స్టూడెంట్స్ ( సిఎన్ఏపిఐస్) జాతీయస్థాయి పరీక్షలో నాగుల వెంకట ఆదిత్య (ఐఎస్ఎంఒ ) ఆల్ ఇండియా ఐదవ ర్యాంకు, కుమారి హాసిత (అర్ ఓ ఏం) ఆల్ ఇండియా ఏడవ ర్యాంకు, కుమారి రితా మెహక్ ఆల్ ఇండియా ఎనిమిదవ ర్యాంకు, మనుకౌశిక్ ఎనిమిదవ ర్యాంకు మరియు పదిహేనవ ర్యాంకులను సాధించిన సుచిత్ర నారాయణ బ్రాంచ్ విద్యార్థులను మంగళవారం రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నరేంద్ర ప్రతాప్ , నారాయణ స్కూల్స్ జి ఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను చూస్తుంటే జాలి కలుగుతుంది



- పదేళ్ల తర్వాత అయినా కేసీఆర్ పొలం బాట పట్టడం సంతోషం
- రైతులపై కేసీఆర్‌ది కపట ప్రేమ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**రంగారెడ్డి జిల్లా, ప్రభాతసూర్యుడు :**
తుక్కుగూడలో ఈనెల 6వ తేదీన ఏఐసీసీ భారీ బహిరంగ సభకు ప్లాన్ చేసిందని.. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హాజరుకానున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు తుక్కుగూడ సభా ప్రాంగణాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పరిశీలించారు. సభ ఏర్పాట్లు, ఇతర అంశాలపై నిర్వాహకులకు సీఎం రేవంత్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ... కాంగ్రెస్‌కు తెలంగాణ కంచుకోట అని నిరూపిస్తామన్నారు. తుక్కుగూడ సభలో ఏఐసీసీ మ్యానిఫెస్టో విడుదల చేస్తుందని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే... రాష్ట్రానికి జరిగే మేలును ఈ సభ ద్వారా తెలియజేస్తామని చెప్పారు. ఈ సభలో మహిళలకు ప్రత్యేక సీట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సోనియా గాంధీ ప్రకటించిన 6 గ్యారెంటీలను తెలంగాణలో ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల కోడ్ రావడంతో పథకాలకు కొంత అంతరాయం కలిగిందని చెప్పారు. ఎన్నికల తర్వాత మిగతా హామీలను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్ల తర్వాత అయినా మాజీ సీఎం కేసీఆర్ 'పొలం బాట' పట్టడం సంతోషమని చెప్పారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినందుకు, కవిత జైలుకు పోయినందుకు కేసీఆర్‌ను చూస్తుంటే జాలి కలుగుతుందని అన్నారు. ఆయనకు ఏ సీజన్ ఎప్పుడు వస్తుందో తెలియదా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాపాలతోనే ఈ కరువు పరిస్థితులు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఆయన చేసిన పాపాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఖాతాలో వేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధును వేయడానికి 10 నెలల సమయం తీసుకుందని చెప్పారు. 65 లక్షల రైతుల ఖాతాలో తాము రైతుబంధు వేశామని.. మిగిలింది 4 లక్షల రైతులేనని ఎన్నికలు అయిపోగానే వీరికి కూడా రైతు బంధు వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

**రైతులపై కేసీఆర్‌ది కపట ప్రేమ**
బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో

2లో..

## పోటీ కాంగ్రెస్‌తో కాదు.. బీజేపీతో..




**మేడ్చల్ మల్కాజ్‌గిరి, ప్రభాతసూర్యుడు :**
మల్కాజ్‌గిరి పార్లమెంట్‌లో మనకు పోటీ కాంగ్రెస్‌తో కాదు.. బీజేపీతోనే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను మళ్లీ జరగనివ్వొద్దని కేటీఆర్ సూచించారు. మేడ్చల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. మేడ్చల్ అంటనే మాస్.. మల్లన్న మారి మాస్.. కేతక్క కూడా సూపర్. ఆమె మాట్లాడుతుంటే మరింత వినబుద్ది అవుతుంది. ఆమె మాట్లాడిన తర్వాత మాట్లాడాలంటే యాటకూర తిన్నాక తోటకూర తిన్నట్టు ఉంటది. మల్లా రెడ్డి మేడ్చల్‌కే పరిమితం కాకుండా.. రాష్ట్రమంతా తిరగాలి. మిగతా నియోజకవర్గాల్లో కూడా ఆయన గొంతు అవసరం అని కేటీఆర్ పేర్కొన్నారు.మల్లారెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించి ఎన్నో రకాల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. ఆయన నియోజకవర్గంలో 10 మున్సిపాలిటీలు ఉంటే అన్నింటికి అన్ని గెలిచారు. అయితే గెలిచింది మల్లారెడ్డి అంటున్నారు కానీ గెలిపించింది మీరు. మీరు కష్టపడితేనే 10కి 10 గెలిచాం. ఎంతో కమిట్ మెంట్ ఉంటేనే ఇది సాధ్యమైంది. మేడ్చల్‌లో బీఆర్ఎస్ బలమేందో తెలిసిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సామాజిక సేవలు చేస్తూ మల్కాజ్‌గిరి పార్లమెంట్‌లోని ప్రజలతో కలిసి మెలిసి ఉన్నారు. బ్రహ్మాండంగా ఆయనకు సేవాగుణం ఉంది. వారిని కేసీఆర్ పిలిచి ఆశీర్వదించి అభ్యర్థిగా ప్రకటించారు. మనకు కాంగ్రెస్‌తో పోటీ లేదు. కేవలం డమ్మీ అభ్యర్థిని మన ప్రాంతంతో సంబంధం లేని వ్యక్తిని నిలబెట్టారు. చేవెళ్లలో రిజెక్ట్ చేస్తే ఇక్కడ బలవంతంగా నిలబెట్టారు. ఇక్కడ మనకు పోటీ బీజేపీతోనే అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కడియంను పార్టీలోకి ఎలా తీసుకున్నావు

- రేవంత్ రెడ్డిపై మందకృష్ణ ఫైర్

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలను ప్రోత్సహి స్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నిప్పులు చెరిగారు. సిగ్గు లేని కడియం శ్రీహరిని కాంగ్రెస్ పార్టీలోకి ఎలా తీసుకుంటా వ్ అని రేవంత్‌ను మందకృష్ణ నిలదీశారు. సోమాజిగూ డ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మందకృష్ణ మాట్లాడారు. పొన్నాల లక్ష్మయ్య పార్టీ మారుతుంటే 75 ఏండ్ల వయసులో పార్టీ మారడం ఏంటి..? ఆయన సిగ్గులేనోడు అని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మందకృష్ణ గుర్తు చేశారు.

## దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

**గజ్వేల్‌జిల్లా, ప్రభాతసూర్యుడు :**
గజ్వేల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తల గురించి ఎంత చెప్పినా తక్కువే.. మూడు సార్లు ఈ గడ్డ నుండి కేసీఆర్‌ను గెలిపించారు. ఈ నియోజకవర్గం కార్యకర్తల రుణం తీర్చుకోలేనిది అని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సమస్యలపైన, పరిపాలన మీద పట్టు ఉన్న వ్యక్తి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి. దుబ్బాకలో పనికి రాని రఘునందన్ ఇప్పుడు మెదక్ పార్లమెంట్‌కు పనికి వస్తాడా?! అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని గజ్వేల్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. రూ. 100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి మన పిల్లల భవిష్యత్తు కోసం ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చిన మంచి మనసున్న మనిషి మన వెంకట్రామిరెడ్డి. ఎంతో మంది అనాథ బిడ్డల్ని అక్కున చేర్చుకున్న గొప్ప వ్యక్తి. కలెక్టర్‌గా తన పాలన మార్కుతో ఎన్నో అవార్డుల్ని ఈ గడ్డకు తెచ్చిన వ్యక్తి వెంకట్రామిరెడ్డి. గజ్వేల్ గడ్డ మీద ఈర్ష్య పెట్టుకున్న ఈ కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓటు ఎందుకు వేయాలి?! గజ్వేల్ నియోజకవర్గ బిడ్డల నోట్లో మట్టి కొట్టిన ఈ కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే నైతిక హక్కు




ఉందా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. 100 రోజుల కాంగ్రెస్ పార్టీ బాండ్ పేపర్ పాలనలో ఉద్ధరించుడు మాట దేవుడెరుగు కానీ, అన్నీ ఉద్దెర మాటలే చెప్తున్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ అయితే కాంగ్రెస్‌కు ఓటెయ్యండి. కాకపోతే కారుకు ఎయ్యుర్రి. యాసంగి వడ్లకు, మక్కలకు 500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతదని మనం ప్రతీ ఊర్ల పంచాయితీ పెట్టాలి..

2లో..

## 70 కిలోల గంజాయి మాయం

**జగిత్యాల జిల్లా, ప్రభాతసూర్యుడు :**



అంబులెన్స్‌లో తరలిస్తూ జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీసులకు పట్టుబడ్డ 70 కిలోల గంజాయి మాయమైంది. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఠాణాకు చేరుకొని విచారణ చేపట్టారు. నిరుడు ఫిబ్రవరిలో గంజాయి ముఠా ఏపీలోని విశాఖపట్నం నుంచి అంబులెన్స్‌లో రాజస్థాన్‌కు తరలిస్తున్న 70 కిలోల గంజాయిని సారంగాపూర్ పోలీసులు పట్టుకు న్నారు. నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అంబులెన్స్‌ను సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోని వెనుక భాగంలో ఉంచారు. గుర్తు తెలియని వ్యక్తులు అంబులెన్స్ అద్దాలు పగులగొట్టి అందులోని గంజాయిని మాయం చేసినట్టు పోలీసులు గుర్తించారు. స్టేషన్‌లోని పోలీస్ సిబ్బందితోపాటు అనుమానితుల నుంచి వివరాలు సేకరించారు.

## రేపు కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో నీటి వినియోగానికి సంబంధించి కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) త్రిమెన్ కమిటీ రేపు (గురువారం) ప్రత్యేకంగా సమావేశం కానున్నది. ఈ మేరకు బోర్డు ఇరు రాష్ట్రాలకు సమాచారం ఇచ్చింది. కమిటీలో బోర్డు మెంబర్ సెక్రటరీ, ఇరు రాష్ట్రాలు ఈఎన్సీలు సభ్యులుగా ఉంటారు.త్రిసభ్య కమిటీ గత అక్టోబర్‌లోనే సమావేశమై రెండు రిజర్వాయర్లలో దాదాపు 82కి పైగా టీఎంసీలు అందుబాటులో ఉన్నాయని నిర్ధారించింది. అందులో ఏపీకి 45, తెలంగాణకు 35 టీఎంసీలను కేటాయించింది. మిగిలిన 2 టీఎంసీలను మే నెల తర్వాత భవిష్యత్ అవసరాలకు వినియోగించాలని తెలిపింది. అయితే, తెలంగాణ ఇప్పటికే కోటాకు మించి నీటిని వాడుకున్నది.కాగా, ఏపీ తన కోటాలో 42 టీఎంసీలను వినియోగించుకోగా, మరో 3 టీఎంసీలు మిగిలి ఉన్నాయి. తాజాగా ఏప్రిల్‌లో మరో 5 టీఎంసీలను విడుదల చేయాలని ఇటీవల ఆంధ్రప్రదేశ్ కేఆర్ఎంబీకి లేఖ రాసింది. కోటాకు మించి 2టీఎంసీలను కోరుతున్నది. ఈ నేపథ్యంలో త్రిమెన్ కమిటీ ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు తెలుస్తున్నది.

## నియోజకవర్గ అభివృద్ధి కోసమే.. పార్టీ చేరాను

**వరంగల్ , ప్రభాతసూర్యుడు :**



బీజేపీ ఆకృత్యాలను అడ్డుకోవడం ప్రాంతీయ పార్టీల వల్ల కాదని.. జాతీయ పార్టీతోనే సాధ్యమని.. అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరానని, అలాగే తన నియోజకవర్గం అభివృద్ధి కోసమే పార్టీ మారానని కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన వరంగల్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గత పదేళ్లుగా కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటిని నాశనం చేస్తోందని విమర్శించారు. దేశంలో ప్రతిపక్షాల నామరూపాలు లేకుండా చేసే విధంగా ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పక్షంగా ఎన్నికైన ప్రభుత్వాలను దొడ్డిదారిన కూలగొట్టి, బెదిరించి, ఈడీ, సీబీఐ కేసుల్లో ఇరికించి ఇబ్బందులకు గురిచేస్తోందని తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్న నిందితుడు బీజేపీలో చేరగానే పునీతులైపోతున్నారని.. అంతేకాకుండా దేశంలో ఉన్న ముస్లిం మైనారిటీస్‌కు భద్రత లేదన్నారు. అలాగే దేశంలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని కడియం శ్రీహరి అన్నారు. బీఆర్ఎస్‌ను వదలడం తనకు బాధగా ఉందని, ఆ పార్టీ తనకు చాలా అవకాశాలు ఇచ్చిందని, తనకు ఇచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేయలేదని కడియం శ్రీహరి అన్నారు. కానీ తనపై ఆ నేతలు విషం కక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను స్థాయి దిగజారి మాట్లాడదలుచుకోలేదని అన్నారు. "మీ బలుపు.. మీ అహంకారం మాటలే ఓటమికి కారణం.. అంతా ఓడారు.. నేను ఒక్కడినే గెలిచననే అక్కసుతో మాట్లాడారు.. బీఆర్ఎస్ ఈ దుస్థితికి పల్లా రాజేశ్వర్ రెడ్డే కారణం.. పల్లా ఓ చీడ పురుగు.. రాజేశ్వర్ రెడ్డి దమ్ముంటే నా చరిత్ర ఎన్నికల ముందు బయటపెట్టాలి.. నిరూపించకపోతే నీ బట్టలు ఊడదీసి జనగామ చౌరస్తాలో నిలబెడతా.. నిన్నమొన్నటి వరకు నా చుట్టూ ఉన్నవాళ్ళు ఇప్పుడు విషం కక్కుతున్నారు".. అని కడియం శ్రీహరి మండిపడ్డారు.బీఆర్ఎస్ పార్టీ తనకు ఒక్క రూపాయి ఇచ్చినట్లు నిరూపించినా తన బిడ్డ... తాను పోటీ నుండి తప్పుకుంటానని కడియం శ్రీహరి సవాల్ చేశారు. మీ అందరి బతుకులు తనకు తెలుసునని..

## డీఎస్సీ ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 11,062 ఉపాధ్యాయ కొలువుల భర్తీకి రేవంత్ సర్కార్ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. తాజాగా విద్యాశాఖ డీఎస్సీ ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును పొడిగిస్తూ ప్రకటన వెలువరించింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. ఆన్‌లైన్ అప్లికేషన్ల గడువు ఏప్రిల్ 2వ తేదీతో ముగియనుంచి. దీనిని జూన్ 20 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు జూన్ 20వ తేదీ రాత్రి 11.50 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లైంది. దరఖాస్తు రుసుము రూ.1000 చొప్పున సమర్పించవల్సి ఉంటుంది. అలాగే విద్యాశాఖ డీఎస్సీ పరీక్ష తేదీలనూ కూడా ఖరారు చేసింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం జులై 17 నుంచి 31 వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాక అధికారులు వెల్లడించారు. కాగా తెలంగాణ వ్యాప్తంగా 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు అత్యధికంగా 2,629 ఉన్నాయి. తర్వాత 727 భాషా పండితుల పోస్టులు, 182 పోస్టులు పీఈటీలు, 6,508 పోస్టులు ఎస్జీటీలు ఉన్నాయి. స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 220 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 796 ఎస్జీటీ పోస్టులు ఉన్నాయి. రాష్ట్రంలోని

2లో..

# కేసీఆర్‌ను చూస్తుంటే జాలి కలుగుతుంది

మొదటి పేజీ తరువాయి

వందేళ్ల విధ్వంసం జరిగిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ మొన్నటి పర్యటనలో జనరేటర్‌తో ప్రెస్‌మీట్ పెట్టి విద్యుత్ పోయిందని తమ ప్రభుత్వంపై నిందలు వేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తాము ఏదైనా కార్యక్రమానికి పిలుపునిస్తే తమను ఎక్కడికక్కడ అరెస్ట్‌లు చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసీఆర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. తాము తలుచుకుంటే కేసీఆర్ బయటకు వెళ్లేవారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఖాతాలో రూ. 1500 కోట్లు ఉన్నాయని.. రైతులకు రూ.100 కోట్లు సహాయం చేయొచ్చు కదా అని చెప్పారు. ఎంపీ ఎన్నికల కోసమే కేసీఆర్ రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి సెటైర్లు వేశారు.

# కడియంను పార్టీలోకి ఎలా తీసుకున్నావు

మొదటి పేజీ తరువాయి

మరి ఇప్పుడు అదే 75 ఏండ్ల కడియం శ్రీహరి పార్టీలోకి వస్తుంటే రేవంత్ రెడ్డి ఆ సిగ్గులేనోడిని ఎలా పక్కన కూర్చోబెట్టుకు న్నాడు..? ఎలా పార్టీలోకి తీసుకు న్నాడు..? అని మందకృష్ణ ప్రశ్నించారు.ఇక బీఆర్ఎస్ కడియం శ్రీహరికి అన్ని పదవులు ఇచ్చింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీతో పాటు చివరకు డిప్యూటీ సీఎంను కూడా చేసింది బీఆర్ఎస్ పార్టీ. కానీ కాంగ్రెస్ పార్టీ పొన్నాల లక్ష్మయ్యను డిప్యూటీ సీఎం కూడా చేయలేదు. కానీ కడియం శ్రీహరికి బీఆర్ఎస్ పార్టీ ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందని మందకృష్ణ తెలిపారు.

# దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

మన అక్కలకు, చెల్లెలకు ప్రతి నెల రూ. 2,500లు డిసెంబర్ నెల నుండి ఇస్తా అన్న మొట్ట మొదటి హామీని అమలు చేయకుండా మహా మోసం చేసిన పార్టీ ఈ కాంగ్రెస్ పార్టీ. రూ. 200 ఉన్న పెన్షన్‌ను రూ. 2000 చేసిన ఘనత మన కేసీఆర్‌ది అయితే, రూ. 4000 ఇస్తామని బాండ్ పేపర్ రాసిచ్చి ఇంత వరకూ పెన్షన్ ఇయ్యని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం. తులం బంగారం, నిరుద్యోగ భృతి ఇస్తామని కల్లబొల్లి మాయ మాటలు, పచ్చి అబద్దాలు చెప్పి ఓట్లు వేయించుకున్నది కాంగ్రెస్ పార్టీ అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# నియోజకవర్గ అభివృద్ధి కోసమే.. పార్టీ చేరాను

మొదటి పేజీ తరువాయి

వాటిని బయటపెడితే ఎవరూ బయట తిరగలేరని అన్నారు. తాను అవకాశవాదిని కాదని, అవకాశాలే తనను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. తాను లేకుంటే మంద కృష్ణమాదిగ లేరని, ఆర్థికంగా కూడా ఆయనకు సహకారం అందించానని చెప్పారు. బీజేపీకు ఓటు వేయమంటున్న మంద కృష్ణ మాదిగ దండోరా ముసుగు తీసేసి బీజేపీ నేతగా ఆ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆయన ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తే ఎన్ని ఓట్లు వచ్చాయో.. ప్రజలకు తెలుసునని అన్నారు. మంద కృష్ణ మాదిగ స్వార్థం వల్లే ఎమ్మార్పీఎస్ బలహీన పడిందన్నారు. ఏఐసీసీ, పీసీసీ తన అవసరాన్ని గుర్తించి.. వెతుక్కుంటూ వచ్చి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు పార్టీ నిర్మాణంపైన దృష్టి లేదని.. పార్టీని పట్టించుకోవడం లేదని... నష్టం జరుగుతుందని కేసీఆర్‌కు ముందే చెప్పానని అయినా పట్టించు కోలేదని శ్రీహరి అన్నారు.

# డీఎస్సీ ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు

మొదటి పేజీ తరువాయి

అన్ని జిల్లాలలో అత్యధిక ఖాళీలు హైదరాబాద్‌లో ఉన్నాయి. ఇక్కడ 878 పోస్టులు భర్తీకానున్నాయి. ఆ తర్వాత స్థానంలో 605 పోస్టులతో నల్గొండ జిల్లా, నిజామాబాద్‌లో 601 పోస్టులు, ఖమ్మం జిల్లాలో 757 పోస్టులు, సంగారెడ్డి జిల్లాలో 551 పోస్టులు, కామారెడ్డి జిల్లాలో 506 పోస్టుల చొప్పున ఖాళీలు ఉన్నాయి.

# భూవివాదం కేసులో కన్నారావు అరెస్టు

**ఆదిబట్ల, ప్రభాతసూర్యుడు :**



ఓ భూవివాదం కేసులో కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావును మంగళవారం ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఆయనకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు. మార్చి 3న రంగారెడ్డి జిల్లా అబ్దులాపూర్‌మెట్ మండలం మన్నెగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 32లో 2.17 ఎకరాల స్థలం వివాదంలో ఆదిబట్ల పోలీసులు అప్పట్లో 38 మందిపై కేసు నమోదు చేశారు. అందులో ఏ4గా కన్నారావును చేర్చారు. వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.అప్పటి నుంచి కన్నారావు రెండుసార్లు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసినా కోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన బయటి ప్రాంతాలకు వెళ్లకుండా ముందుగానే పోలీసులు లుక్‌అవుట్ నోటీసు జారీ చేశారు. హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో ఉన్న ఓ అడ్వకేట్‌ను కలవడానికి కన్నారావు మంగళవారం రావడంతో ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తమ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అయితే తానే పోలీసులకు సమాచారం ఇచ్చి లొంగిపోయినట్టు కన్నారావు తెలిపారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, కోర్టులో న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉన్నదని చెప్పారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో అడిషనల్ ఎస్పీలకు రిమాండ్

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలకు నాంపల్లి కోర్టు రిమాండ్ విధించింది. నేటితో ఇద్దరి కస్టడీ ముగియడంతో (మంగళవారం) ఉదయం ఇరువురిని పోలీసులు నాంపల్లి కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఈనెల 6 వరకు అడిషనల్ ఎస్పీలకు కోర్టు రిమాండ్ విధించింది. దీంతో భుజంగరావు, తిరుపతన్నలను కాసేపట్లో పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించనున్నారు.

కాగా.. ఈ కేసులో ఏ4గా ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు వెలుగు చూశాయి. మొదటి సారి రిటైర్డ్ ఐజి పేరును రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు ప్రస్తావించారు. రిటైర్డ్ ఐజితో పాటు




తిరుపతన్న, భుజంగ రావు, రాదాకిషన్ రావు, ప్రణీత్ రావు, వేణు గోపాల్ రావు కలిసి కుట్ర పన్నారని పేర్కొన్నారు. పంజాగుట్ట పోలీసులు నాంపల్లి కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో ఫోన్ ట్యాపింగ్ జరిగిన తీరు మొదలు.. బీఆర్ఎస్ కోసం పోలీసులు డబ్బును తరలించడం.. ప్రత్యర్థి పార్టీలకు సంబంధించిన నగదును సీజ్ చేయడం వరకు ప్రభాకర్‌రావు 'స్పెషల్ ఆపరేషన్ టీమ్' విధులను రాధాకిషన్ వివరించినట్లు రిమాండ్ రిపోర్టు స్పష్టం చేస్తోంది. పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును ఇంటెలిజెన్స్ చీఫ్(ఓఎస్డీ)గా నియమించడం గత ప్రభుత్వ పెద్దల వ్యూహాత్మక చర్య అని రాధాకిషన్‌రావు పేర్కొన్నట్లు దర్యాప్తు అధికారులు రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించారు.

# బీజేపీ నేత రఘునందన్ రావుపై కేసు నమోదు..



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**

తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు దగ్గరప డుతున్నా కొద్దీ.. రాష్ట్రంలో రాజకీయ నాయ కుల మధ్య మాటల తూటాలు పేలుతున్నా యి. ఒకరిపై ఒకరు చేసుకుంటున్న విమర్శలు అగ్గి రాజేస్తున్నాయి. రాజకీయప రంగా చేసుకునే విమర్శలు కాస్తా.. ఇప్పుడు వ్యక్తిగత దూషణలకు దారితీస్తున్నాయి. ఈ క్రమంలోనే.. హరీశ్ రావు, వెంకటరామి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గానూ.. మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుపై సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గానూ రఘునందన్ రావుపై సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైం ది. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘన సహా అనుచిత వ్యాఖ్యలు చేశారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్.. రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో.. రఘునందన్ రావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే.. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీలో రఘునందన్ రావు చేసిన అనుచిత వ్యాఖ్యల గురించి పేర్కొన్నారు.ఓ మీటింగ్‌లో రఘునందన్ రావు మాట్లాడుతూ.. హరీశ్ రావు, వెంకటరామి రెడ్డి ఉద్దేశించి.. "ఇంటికొచ్చి కొడతా దొంగ నా కొలిలిల్లారా", "పెయ్యి మీద బట్టలిప్పి కొడతా దొంగ నా కొలిలిల్లారా.." అంటూ వ్యాఖ్యానించినట్టుగా చింతా ప్రభాకర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మాటలు సమాజంలో హింసను రేకెత్తించేలా ఉన్నాయని.. దీనివల్ల కార్యకర్తల మనోభావాలు దెబ్బతిని ఘర్షణలకు దిగే అవకాశం ఉందంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయటం.. ఎన్నికల నిబంధనలకు కూడా విరుద్ధమని గుర్తు చేశారు. ఈ మేరకు ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరగా.. పోలీలులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.మరోవైపు.. ఫోన్ ట్యాపింక్ వ్యవహారంపై రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. దుబ్బాక ఉప ఎన్నికలప్పుడే తమ ఫోన్లు ట్యాపింగ్ అవుతున్నాయని చెప్పినట్టుగా గుర్తు చేశారు. ఆ విషయం మాట్లాడితే.. తమ మీదే కేసు పెట్టారని రఘునందన్ రావు తెలిపారు. వివేక్ వెంకట స్వామి, కోమటి రెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి.. ఇప్పుడు అధికార పార్టీలో ఉన్నారని, మీరు శిక్షించే స్థానంలో ఉన్నారని చెప్పుకొచ్చారు. 2015లో రేవంత్ రెడ్డి పోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని పక్కన పెట్టి ఆ తర్వాత జరిగిన పోన్ ట్యాపింగ్‌లపై విచారణ అంటున్నారంటూ చెప్పుకొచ్చారు. ఫోన్ ట్యాపింగ్ చేసినప్పుడు ఇంటిలిజెన్స్ చీఫ్ ప్రస్తుత ఇంటిలిజెన్స్ చీఫ్ శివదర్ రెడ్డి కాదా.. అంటూ రఘునందన్ రావు ప్రశ్నించారు.

# ఇద్దరు నకిలీ మావోయిస్ట్‌లు అరెస్ట్

**వరంగల్ , ప్రభాతసూర్యుడు :**

ఇద్దరు నకిలీ మావోయిస్టులను హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. మావోయిస్టుల పేరుతో బెదిరిస్తూ డబ్బులు గుంజుతున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గుడ్లపాడుకు చెందిన దాసరి శ్రీకాంత్, వరంగల్ కరీమాబాద్‌కు చెందిన బాలిని మహేశ్ ఇద్దరూ కొంతకాలంగా నకిలీ మావోయిస్టులుగా చలామణీ అవుతున్నారు. ఈ క్రమంలో భారత కమ్యూనిస్టు మావోయిస్ట్ పార్టీ చర్ల శబరి ఏరియా కమిటీ కమాండర్ దేవన్న పేరుతో నకిలీ లెటర్ ప్యాడ్ సృష్టించారు. రోగుల నుంచి అడ్డగోలుగా డబ్బులు తీసుకుంటున్నారని తమకు ఫిర్యాదులు వచ్చాయని బెదిరిస్తూ హనుమకొండలోని అజరా హాస్పిటల్, దీపక్ స్కిన్ క్లినిక్ హాస్పిటల్, ఎన్ఎస్ఆర్ గ్రూప్ సంస్థ యాజమాన్యాలకు లేఖలు పంపించారు. తమకు డబ్బులు ఇవ్వాలని.. లేదంటే నక్సల్స్ చేతిలో చనిపోతారంటూ హెచ్చరించారు. దీంతో ఆయా




యాజమాన్యాల ఫిర్యాదుతో హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. దర్యాప్తులో భాగంగా శ్రీకాంత్, మహేశ్ మావోయిస్టుల పేరు చెప్పుకుని ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. వారిని అరెస్టు చేసి, వారి దగ్గర నుంచి నకిలీ లెటర్ ప్యాడ్, ఒక ద్విచక్రవాహనం, రెండు మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు

# పంట నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి

**జోగులాంబా గద్వాల, ప్రభాతసూర్యుడు :**

జిల్లాలో అనేక గ్రామాల్లో పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. చేతికొచ్చే దశలో పంటలు నష్టపోవడం రైతాంగానికి ఆందోళన కలిగిస్తున్నదని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. రాష్ట్రంలో ఎండిన పంటలకు ఎకరాకు 25 వేలు నష్టపరిహారం పంటలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లో కలెక్టర్ కు వినతిపత్రం ఇచారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంటనే గ్రామాల వారీగా పంటల నష్టాన్ని అంచనా వేయడానికి అధికారుల బృందాలను నియమించి యుద్ధ ప్రాతిపదికన నివేదికలు తెప్పించుకోవాలని విజ్ఞప్తి చేశారు.గ్రామాల వారీగా వచ్చిన పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపి ఎకరాకు 25 వేల రూపాయల నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరితో పాటు వివిధ పంటలకు మద్దతు ధరకు అదనంగా 500 రూపాయలు చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో హామీ ఇచ్చి మోసం చేసింది. వెంటనే రైతులకు న్యాయం జరిగిలే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ప్రతాప్, విజయ్, రాజారెడ్డి, జెడ్పిటిసి రాజశేఖర్, ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు



## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



**యాదాద్రి , ప్రభాతసూర్యుడు :**
వలిగొండ పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి 314వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ శివాజీ అని గోల్కొండ కోటపై శ్రామికుల జెండా ఎగురవేసేందుకు ప్రతిన పూనిన ధైర్యశాలి అని తొలి తెలుగు బహుజన చక్రవర్తిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని కులవృత్తులను ఏకం చేసి పోరాటం చేశారని వారి పోరాట సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని వారన్నారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సంఘ సభ్యులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కులాలన్నీ ఏకమై మధును గెలిపించాలి

**మెదక్ , ప్రభాతసూర్యుడు :**
బీసీలందరూ ఏకమై మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కోరారు. నీలం మధు ముదిరాజ్ విద్యానగర్‌లో ఆర్.కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలవడానికి మంగళవారం ఆయన నివాసానికి వచ్చారు. ఎంపీ ఎన్నికల్లో సహకారం అందించి తనకు అండగా నిలవాలని కృష్ణయ్యను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు సుధాకర్ ముదిరాజ్, నందగోపాల్, వేమూరి రామకృష్ణ తదితరులు నీలం మధుకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ సామాజికవర్గానికి చెందిన నీలం మధును ఎంపీ ఎన్నికల్లో గెలిపించుకుంటే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీసీ వర్గాలను గెలిపించుకునే అవకాశం ఉంటుందన్నారు. బీసీ కులాలు, ఇతర అన్ని కులాల మద్దతుదారులు, సానుభూతిపరులు ఐక్యంగా నీలం మధును పార్లమెంట్‌కు పంపించాలని కోరారు.,

## శంషాబాద్- అయోధ్య విమాన సర్వీసు ప్రారంభం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నేరుగా అయోధ్యకు వెళ్లే విమాన సర్వీసును ప్రారంభించినట్లు జీఎంఆర్ అధికారులు మంగళవారం వెల్లడించారు. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో స్పైస్‌జెట్ ఎస్‌జీ611 విమానం ఉదయం 10.45 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో బయలుదేరి మధ్యాహ్నం 12.45 గంటలకు అయోధ్య చేరుతుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఎస్‌జీ616 విమానం మధ్యాహ్నం 1.25 గంటలకు అయోధ్యలో బయలుదేరి మధ్యాహ్నం 3.25 గంటలకు శంషాబాద్ చేరుతుందని చెప్పారు. అయోధ్య సమీపంలోని పుణ్యక్షేత్రాలను సందర్శించాలనుకునే ప్రయాణికులకు ఈ నూతన సర్వీసు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ సర్వీసును ప్రారంభించడం ఎంతో సంతోషకరంగా ఉందని జీఎంఆర్ సీఈవో ప్రదీపఫణికర్ అన్నారు. స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ అధికారులు, జీఎంఆర్ ప్రతినిధులు మొదటి ప్రయాణికుడికి టికెట్‌ను అందజేశారు.

## పోలీసు కేసులకు భయపడి ప్రేమజంట ఆత్మహత్య

**కొందుర్గు, ప్రభాతసూర్యుడు :**
ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ అబ్బాయి, అమ్మాయి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దాంతో తమ తమ కుటుంబాలకు తెలియకుండా గుడిలో పెళ్లి చేసుకున్నారు. అయితే అమ్మాయి మైనర్ కావడంతో పోలీసు కేసులు అవుతాయని భయపడి ఇద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద సంఘటన రంగారెడ్డి జిల్లాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొందుర్గు మండలంలోని ఉత్తరాసపల్లికి చెందిన కావలి బాలకిష్టయ్య–లక్ష్మమ్మలకు దంపతులకు ఓ కొడుకు, ఇద్దరు కూతుళ్లు. పిల్లల చిన్న వయసులోనే బాలకిష్టయ్య చనిపోవడంతో లక్ష్మమ్మ కూలి పనుల చేస్తూ పిల్లలను పెంచింది. కూతుళ్లకు పెళ్లి చేసి కొడుకు శ్రీకాంత్(24)తో కలిసి ఉంటోంది. పదో తరగతి వరకు చదివిన శ్రీకాంత్ షాద్‌నగర్‌లోని ఓ కిరాణ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతడికి ఆరునెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో బండ్లగూడ జాగీర్ కిస్మత్‌పురకు చెందిన ఓ పదోతరగతి బాలిక(16)పరిచయమైంది. పరిచయం ప్రేమగా మారడంతో పెళ్లి చేసుకోవాలనుకున్నారు. బాలిక మైనర్ కావడంతో ఇరు కుటుంబాలు ఒప్పుకోవని గతనెల 27న యాదగిరిగుట్ట ఆలయానికి వెళ్లి పెళ్లి చేసుకున్నారు. మార్చి 30న శ్రీకాంత్ వాళ్ల గ్రామానికి రాగా, గ్రామస్థులు మైనర్‌ను పెళ్లి చేసుకున్నందుకు పోలీసు కేసు నమోదవుతుందని చెప్పారు. బాలికను ఆమె తల్లిదండ్రుల వద్ద వదిలిపెట్టమని అన్నారు. దాంతో కేసులకు భయడి, కలిసి ఉండలేమని భావించి శ్రీకాంత్, ఆ బాలిక గతనెల 30న గ్రామ సబ్‌స్టేషన్ వద్ద పురుగు మందు తాగారు. వారిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి బాలిక మృతి చెందగా, మంగళవారం తెల్లవారుజామున శ్రీకాంత్ చనిపోయాడు. శ్రీకాంత్ తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఉచిత మంత్రం జపిస్తున్న రాజకీయ పార్టీలు

- సంక్షేమం పేరుతో అడ్డూ అదుపు లేకుండా ఉచిత పథకాలు
- దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందంటూ విమర్శలు
- పేద వర్గాలకు బతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వాల ప్రధాన కర్తవ్యం కావాలి
- ఉచితాలతో అప్పుల కుప్పలుగా రాష్ట్రాలు



**డెస్క్, ప్రభాతసూర్యుడు :**
దేశంలో ఉచితాల అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాలపై కొంతకాలంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఉచిత పథకాలపై ఇచ్చే హామీలను నియంత్రించాలంటూ కొంతమంది న్యాయస్థానాల గడప కూడా తొక్కారు. ఇటీవలి కాలంలో దాదాపుగా అన్ని పార్టీలు ఉచిత మంత్రం జపిస్తున్నాయి. అయితే దీనిపై,పన్నుల రూపాల్లో ప్రజలు కట్టిన సొమ్మును ఉచితాల పేరుతో పంచి పెడుతున్నారన్న వాదన వ్యతిరేక వర్గం నుంచి వినిపిస్తోంది. మరోవైపు ఉచితాలు కొనసాగించాల్సిందేనన్న వాదన కూడా బలంగా వినిపిస్తోంది. ప్రభుత్వానికి సంపద సృష్టించడం ముఖ్యమే కావచ్చు. దీనికోసం రకరకాల మార్గాలున్నాయి. కానీ పేద వర్గాలకు బతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వాల ప్రధాన కర్తవ్యం కావాలి. అందుకే ఉన్న సంపదలో పేదవర్గాలకు కాస్తంత వాటా ఇవ్వాల్సిందేనంటున్నారు జనం పక్షాన నిలబడే ఆర్థిక వేత్తలు. పరిమితికి మించకుండా కొంతమేర ఉచితాలు ఇవ్వడంలో ఎలాంటి తప్పులేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచితాలను తాయిలాల సంస్కృతిగా వ్యతిరేకులు పేర్కొంటున్నారు. తాయిలాల సంస్కృతి దీర్ఘకాలంలో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్న విమర్శలు వస్తున్నాయి. సంక్షేమం పేరుతో అడ్డూ అదుపు లేకుండా ఉచిత పథకాలు అమలు చేయడం దేశ ఆర్థిక వ్యవస్థకు ఏమాత్రం మంచిది కాదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఉచితాలతో రాష్ట్రాలు అప్పుల కుప్పలుగా మారుతున్నాయంటున్నారు కొందరు ఆర్థిక వేత్తలు. ప్రజల నుంచి వివిధ రకాల పన్నుల రూపంలో ప్రజల నుంచి సేకరించిన సొమ్ములను రాజకీయ ప్రయోజనాల కోసం, ఓట్ల కోసం పందారం చేయడం ఎంతవరకు సమంజసమని వీరు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి మన దేశంలో ఉచిత పథకాలు ఇప్పటికిప్పుడు వచ్చినవి కావు. కొన్ని దశాబ్దాల నుంచి ఉచిత పథకాలు అమలవుతున్నాయి. ఉచిత పథకాలు అనగానే వెంటనే గుర్తుకువచ్చేది తమిళనాడు రాష్ట్రం. తమిళనాడు ఉచిత పథకాలకు పెట్టింది పేరు. తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్‌ను ఉచితాలకు ఆద్యుడిగా చెప్పవచ్చు. ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాతే ఉచితాలు ఎక్కువయ్యాయి. అయితే ఆయన ఉచితాలు ప్రారంభించడం వెనుక ఎటువంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. 70ల్లో తమిళనాట పేదరికం బాగా ఉండేది. మూడు పూటలా తిండి సంపాదించుకోవడానికే పేదలు నానా ఇబ్బందులు పడేవారు. చిన్నారులను బడులు మానిపించి సంపాదన కోసం కారా?నాలకు పంపేవారు. ఈ స్థితిని చూసి ఆయన పేదలను ఆదుకోవాలనుకున్నారు. ఈ నేపథ్యంలోనే పాఠశాల పిల్లలకు మధ్యాహ్న భోజనం అనే వినూత్న పథకాన్నిప్రారంభించారు.

ఆర్థికశాస్త్రంలో సంపద సృష్టి, సంపద పంపిణీ మధ్య నిరంతర చర్చ జరుగుతూనే ఉంది. ఇరవయ్యవ శతాబ్దం తొలిరోజుల్లో ప్రపంచవ్యాప్తంగా వలస పాలన వ్యతిరేక స్వాతంత్ర్య ఉద్యమాలు పెల్లుబికి ముందుకు వచ్చాయి. ఈ ఉద్యమాలు అన్ని దేశాల్లోనూ సంక్షేమ రాజ్యం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ప్రజల మద్దతు సమీకరించాయి. ఏ దేశ స్వాతంత్ర్య ఉద్యమం కూడా తాము పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మిస్తాం అని కనీసం మాట వరసకు కూడా అనలేదు. ఇక్కడో విషయం ప్రస్తావించుకుని తీరాలి. 1971-72 ప్రాంతంలో పేదరిక నిర్మూలన గురించి విస్తృతంగా ప్రచారం జరుగుతున్న సమయంలో ఇందిరా గాంధీ ఓ రోజు ఛాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక సదస్సులో పాల్గొన్నారు. అప్పుడు సంపద పెరగకుండా సంక్షేమాన్ని ఎలా సాధిస్తారని ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన ఓ ప్రముఖుడు ఇందిరా గాంధీని ప్రశ్నించారు. దీనికి ఇందిర జవాబు చెబుతూ ఉచితాలను బలపరిచారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కొన్ని దశాబ్దాల పాటు తమ జీవితాలు మారతాయని ప్రజలు ఆశించారని ఆమె చెప్పారు. అయితే అనేకానేక కారణాలతో ప్రజల బతుకుల్లో వెలుగులు రాలేదన్న వాస్తవాన్ని ఇందిర అంగీకరించారు. ఈ నేపథ్యంలో పేదల బతుకులు బాగు చేయడం కోసం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదన్నారు. ఉన్న సంపదలోనే పేదలకు కొంత వాటా ఇవ్వడం తప్పనిసరి అంటూ ఉచితాలను ఇందిరా గాంధీ అప్పట్లోనే బలపరిచారు.ఏది ఏమైనా కాలే కడుపునకు పట్టెడన్నం పెట్టడమే ప్రభుత్వాల విధి కావాలి. సంక్షేమం పేరుతో కొంతవరకు ఉచితాలను ప్రకటించినా, వాటిని స్వాగతించాల్సిందే. సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన కర్తవ్యం కావాలి. ప్రభుత్వ రంగ బ్యాంకులకు లక్షల కోట్ల రూపాయల రుణాన్ని ఎగవేసి ఎంచక్కా విదేశాల్లో విలాసవంతమైన జీవితాలను అనుభవిస్తున్న కార్పొరేట్ దిగ్గజాల గురించి పల్లెత్తు మాట అనని ఆర్థికవేత్తలు పేదవారి కోసం అమలు చేస్తున్న ఉచితాలకు వ్యతిరేకంగా మాట్లాడటం విడ్డూరం. ఏమైనా సమాజంలోని మెజారిటీ ప్రజలు కోరుకునేది సంక్షేమ రాజ్యమే. సంక్షేమమే పాలకులకు తారకమంత్రం కావాలంటున్నారు ప్రజల పక్షాన నిలబడే ఆర్థిక వేత్తలు. రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచితాలను తాయిలాల సంస్కృతిగా పేర్కొనడం కూడా సమంజసం కాదు. ఇది ఉచితాల వల్ల ప్రయోజనం పొందే పేదలను అవమానించడమే. పేదల బతుకుల్లో వెలుగుల్లో నింపడానికి అప్పట్లో ఇందిర చెప్పినట్లు ఉన్న సంపదలో కొంత వాటా ఇవ్వాల్సిందే. పేదల కోసం ఉచితాలను స్వాగతించాల్సిందే.

# ఎంపీగా ములుగు అభివృద్ధికి ఎంతగానో కృషి చేశాను

**ములుగు జిల్లా, ప్రభాతసూర్యుడు :**
ఏటూరు నాగారం వై జంక్షన్ వద్ద బిజెపి పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల అధ్యక్షుడు గాడి చర్ల రాజశేఖర్ అధ్యక్షతన ఎంపీ ఎన్నికల పై సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా.బీజేపీ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి ప్రొ" అజ్మీరా సీతారాం నాయక్ బీజేపీ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం హాజరయ్యారు. కార్యక్రమం లో ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్ మాట్లాడుతూ నేను గతం లో ఎంపీ గా ఉన్నప్పుడు ఎన్నో అభివృద్ధి పనులు చేశాను అని వెంకటాపురం మండలంలోని రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడానికి ఎంతగానో కృషి చేశానని చేశాను అని మరియు మన ములుగు జిల్లా కేంద్రానికి గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి నేను ఎంతో కృషి చేశానని బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ లో కనుమరుగై పోతుంది అని బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల మాటలు వినద్దు అని బి ఆర్ ఎస్ పార్టీ వారు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు అని నేను ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే నన్ను పార్టీ నుండి బయటకు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు అని కానీ నేను పేద ప్రజలకు అండగా ఉండడానికి ప్రధాని నరేంద్ర మోడీ అడుగు జాడల్లో నడవాలని బీజేపీ పార్టీ లోకి వచ్చాను అన్ని తెలిపారు కాంగ్రెస్ పార్టీ మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది ఏమీ లేదు అని బీజేపీ పార్టీ తోనే దేశం ఎంతో అభివృద్ధి దిశగా ముందుంటది రాబోయే ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ లో బీజేపీ పార్టీ నీ అత్యధిక మెజారిటీ తో గెలిపించడానికి బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు పని చేయాలని అన్నారు. నేను గెలిచాక మన ప్రాంత అభివృద్ధి జరిగేలా కృషి చేస్తానని ఏటూరు నాగారం మండలం లో ఉన్న సమస్యలు అన్ని పరిష్కారం చేస్తాను అన్నారు. నేను గతం లో ఎంపీ గా ఉన్నప్పుడు 40 పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనీ మన ప్రాంతం గురించి ఎన్నో ప్రశ్నల తో ప్రశ్నించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమం లో మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ మూసుకు శ్రీనివాస్. కిషన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాడీ రామరాజు నేత. గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండపల్లి సత్యం. దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు వావిలాల జనార్ధన్.నాయకులు వెంకటేశ్వర్లు.కర్ణ సంపత్. గద్దెల ప్రణయ్. పరిదల శీను. యానాల చంద్రారెడ్డి. మనోహర్. శివ. గంగ. చక్రి. ప్రేమలత. గడ్డం సత్యం. మమత. నిర్మల మాదరి కృష్ణ ఎలకపల్లి శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు



# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ములుగు జిల్లా, ప్రభాతసూర్యుడు :**
ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ,ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగే విధంగా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం లో జిల్లా అదనపు కలెక్టర్ ,జిల్లా వైద్య అధికారుల తో కలిసి నెల వారి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవల సంఖ్య పెరిగే విధంగా చూడాలని అన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే వారికి వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని , మండలలలో ఉండే ప్రాథమిక వైద్య కేంద్రాలలో వైద్యులు అందుబాటులో ఉండాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాలలో ఆశ వర్కర్ల పాత్ర కీలకంగా ఉంటుందని ప్రజలకు ఆరోగ్య సూత్రాల విషయంలో ప్రజలను అవగాహన పెంచే విధంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ,ఆశ వర్కర్స్ కి ప్రత్యేకంగా శిక్షణ అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యం కోసం వచ్చేవారికి అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని అన్నారు.గర్భిణీ స్త్రీల వివరాలు ఏ ఎన్ సి రిజిస్టర్ లో నమోదు చేయాలని , ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ప్రెగ్నెన్సీ క్యాలెండర్ ఏర్పాటు చేసుకోవాలని , వైద్యుల మరియు సిబ్బంది హాజరు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఎమర్జెన్సీ సమయం లో 108 వాహనాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అలేం అప్పయ్య , ములుగు సామాజిక ఆసుపత్రి వైద్య అధికారి డాక్టర్ జగదీష్ , సి హెచ్ సి ఏటూర్ నాగారం వైద్యాధికారి డాక్టర్ సురేష్, డిప్యూటీ డిఎంహెచ్ఓ ఏటూరు నాగారం డాక్టర్ క్రాంతి కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పవన్, డాక్టర్ రవీందర్ నాయక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ,పాల్గొన్నారు.



# కోనుగంటి కృపాకర్ రాజుకు వార్డు ప్రధానం

**ప్రభాతసూర్యుడు , తొర్రూర్:**
పట్టణ కేంద్రానికి చెందిన కోనుగంటి కృపాకర్ రాజు ను శ్రీ అయ్యప్ప సేవారత్న అవార్డుతో తెలంగాణ రాష్ట్ర శ్రీ అయ్యప్ప స్వామి సేవార్థి ఐక్యవేదిక హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పుష్పగిరి పీఠాధిపతులు అభినవోద్దన విద్యా శంకర భారతి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ల చేతుల మీదుగా ప్రధానం చేసి సత్కరించారు. వృత్తిరీత్యా కే మూర్తి రాజు ఉత్తమ ఉపాధ్యాయులు కావడంతో తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న కోనుగంటి కృపాకర్ రాజు క్రమశిక్షణను అలవర్చుకొని గత మూడు దశబ్దాలుగా అయ్యప్ప సేవకునిగా గుర్తింపు పొంది ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు పలు జిల్లాల్లో జరిగే అయ్యప్ప స్వామి మహా పడిపూజలకు వెళ్లి గురుస్వామిగా గాయకునిగా సేవలందిస్తూ వేలాది మందికి సుపరిచితులై ఎంతో మంది భక్తులను, వృద్ధులను సైతం, ఎంతో ఓర్పుతో చేరదీసి దైవదర్శనాలకై వారిని మణికంఠ టూర్ ట్రావెల్స్ ద్వారా దేశం నలుమూలల యాత్రలు నిర్వహించి మంచి సేవకునిగా తన సేవ నిరతిని చాటినందుకు గాను, గతములో స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నటరత్న స్వర్గీయ నందమూరి తారకరామారావు చేతుల మీదుగా ఉమ్మడి రాష్ట్ర ఉత్తమ గురుస్వామి, కళారత్న అవార్డు పొందినందుకు గాను

వారి సేవ నిరతిని గుర్తించి శ్రీ అయ్యప్ప సేవ రత్న అవార్డు తో సత్కరించినట్లు తెలంగాణ శ్రీ అయ్యప్ప స్వామి సేవ ఐక్యవేదిక హైదరాబాద్ పుష్పగిరి పీఠం వారు తెలిపారు. ఈ సందర్భంగా కోనుగంటి కృపాకర్ రాజు మాట్లాడు తూ నాకి అవార్డును ప్రధానము చేసిన రాష్ట్ర అయ్యప్ప సేవార్థి ఐక్యవేదిక నిర్వాహ కులకు, సహకరించిన పెద్దలకు ఈ సందర్బంగా ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కరాచారి కుమారస్వామి, భాహ్మోము, పాశం రమేష్, సుధాకర్, శ్రీకాంత్, రాంప్రసాద్ పాల్గొన్నారు.




# మార్చిలో రూ.1.78 లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లు

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు**
దేశంలో అమాంతం పెరిగిన పన్ను వసూళ్లు ప్రభుత్వ ఖజానాను నింపివేస్తున్నాయి. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లు మరోమారు భారీగా నమోదయ్యాయి. ప్రస్తుత ఏడాది మార్చిలో ఏకంగా రూ.1.78 లక్షల కోట్ల పన్ను వసూళ్లు జరిగాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. ఇంతక్రితం ఏడాది ఇదే నెల వసూళ్లతో పోల్చితే 11.5 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత 2023 ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.1.87 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. ఆ తర్వాత గడిచిన నెలలో మరోమారు రికార్డ్ జిఎస్‌టి వసూళ్లయ్యింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో జిఎస్‌టి రాబడి మొత్తంగా 11.7 శాతం పెరిగి రూ.20.14 లక్షల




కోట్లుగా ఉంది. ప్రతీ నెల సగటున రూ.1.68 లక్షల కోట్ల రాబడి ఉంది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల కోట్ల సగటు చోటు చేసుకుంది. గడిచిన మార్చి మొత్తం వసూళ్లలో సిజిఎస్‌టి వాటా రూ.34,532 కోట్లుగా, ఎస్‌జిఎస్‌టి వాటా రూ.43,746 కోట్లుగా, ఐజిఎస్‌టి కింద రూ.87,947 కోట్లుగా నమోదయ్యింది. సెస్సుల రూపంలో మరో రూ.12,259 కోట్లు వచ్చింది. తెలంగాణలో గతేడాది మార్చిలో రూ.4804 కోట్ల వసూళ్లు జరగ్గా.. గడిచిన నెలలో 12 శాతం వృద్ధితో రూ.5,399 కోట్లకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో గతేడాది మార్చిలో రూ.3,532 కోట్లుగా ఉన్న జిఎస్‌టి వసూళ్లు.. గడిచిన నెలలో 16 శాతం పెరిగి రూ.4082 కోట్లుగా నమోదయ్యాయి.

# ఐటీ చెల్లింపులపై క్లారిటీ ఇచ్చిన కేంద్రం




**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు**
ఏప్రిల్ 1 నుంచి 2024-25 కొత్త ఆర్థిక సంవత్సరం మొదలైంది. ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి కొన్ని కొత్త నిబంధనలు అమలులోకి వస్తాయి. ఆ సమాచారంపై చాలామందికి సరైన అవగాహనలేక తప్పుదారి పట్టిస్తుంటారు. తాజాగా ఆదాయ పన్ను కొత్త విధానానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం ప్రచారమవుతోంది. అందరూ తప్పకుండా కొత్త పన్ను స్లాబ్‌లనే పాటించాలని పోస్టులు పెడుతున్నారు. ఈ అంశం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ దృష్టికి వచ్చింది. దాంతో కొత్త పన్ను విధానంలో తలెత్తిన అనుమానాలపై క్లారిటీ ఇస్తూ మంత్రిత్వశాఖ తన 'ఎక్స్' ఖాతాలో కొన్ని కీలకాంశాలను పేర్కొంది. ఆర్థికశాఖ వివరాల ప్రకారం..పన్ను విధానంలో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్తగా మారేదీ ఏదీ లేదు. పాత పన్ను విధానం స్థానంలో సెక్షన్ 115 కింద కొత్త పన్ను విధానాన్ని గతంలోనే ప్రవేశపెట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి కంపెనీలు, సంస్థలు కాకుండా వ్యక్తులందరికీ కొత్త పన్ను విధానం డీఫాల్ట్‌గా వర్తిస్తుంది.

కొత్త పన్ను విధానంలో పన్ను రేట్లు తక్కువగా ఉన్నాయి. అయితే పాత పన్ను విధానంలో కల్పిస్తున్న మినహాయింపులు, డిడక్షన్స్ (స్టాండర్డ్ డిడక్షన్ రూ.50,000, ఫ్యామిలీ పెన్షన్ రూ.15,000 మినహా) కొత్త విధానంలో లేవు. కొత్త పన్ను విధానం ఇక నుంచి డీఫాల్ట్‌గా వర్తించనుంది. అయితే పన్ను కట్టేవారు కొత్తది లేదా పాతదాంట్లో ఏది లాభదాయకంగా ఉంటే దాన్ని ఎంపిక చేసుకోవచ్చు. 2024-25 ఆర్థిక సంత్సరానికి సంబంధించి రిటర్నులు ఫైల్ చేసే వరకు కొత్త పన్ను విధానం నుంచి వైదొలగడానికి అవకాశం ఉంటుంది.

ఎలాంటి వ్యాపార ఆదాయం లేని అర్హులైన వ్యక్తులు ప్రతి ఆర్థిక సంవత్సరానికి తమకు నచ్చిన పన్ను విధానాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుంది. వారు ఒక ఆర్థిక ఏడాదిలో కొత్త పన్ను విధానం, మరొక ఏడాదిలో పాత పన్ను విధానాన్ని ఎంచుకోవచ్చు.

# సీపీఎస్‌ఈల్లో వాటాల విక్రయంతో రూ.16,507 కోట్లు

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు**
గత ఆర్థిక సంవత్సరంలో (2023-24) కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్‌ఈ)ల్లో మైనారిటీ వాటాల విక్రయం ద్వారా ప్రభుత్వం రూ.16,507.29 కోట్లు సమీకరించింది.మొత్తంగా 10 సీపీఎస్‌ఈల్లో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌సీ) ద్వారా వాటాలను ప్రభుత్వం విక్రయించింది. కోల్ ఇండియాలో వాటా విక్రయం ద్వారా రూ.4,186 కోట్లు రాగా.. ఎన్‌హెచ్‌పీసీ నుంచి రూ.2,488 కోట్లు, ఎన్‌సీఎల్ నుంచి రూ.2,129 కోట్లు ఖజానాకు వచ్చాయి. ఐఆర్‌ఈడీఏ తొలి పబ్లిక్ ఆఫర్ ద్వారా రూ.858 కోట్లు సమీకరించింది. ఆర్‌వీఎన్ఎల్, ఎస్‌జేవీఎన్, ఇర్కాన్ ఇంటర్నేషనల్, హడ్కో, సూటీలలో కొన్ని షేర్లను ప్రభుత్వం విక్రయించింది. గత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.51,000 కోట్లు సమీకరించగలమని బడ్జెట్లో ప్రభుత్వం అంచనా వేసింది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి 1న సవరించిన అంచనాల్లో.. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా సమీకరించే నిధుల వివరాలను వేరే విభాగం కింద ప్రభుత్వం చూపించింది. ఈ ప్రకారం.. కేపిటల్ రిసీట్స్ కింద రూ.30,000 కోట్లు లభిస్తాయని పేర్కొంది. వీటిల్లో పెట్టుబడుల ఉపసంహరణ కింద సమీకరించే నిధులు రూ.20,000 కోట్లు కాగా.. ఆస్తుల నగదీకరణతో రూ.10,000 కోట్లు రావొచ్చని తెలిపింది. అంటే 2023-24లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా సమీకరించిన రూ.16,507 కోట్లు.. ప్రభుత్వ అంచనా రూ.20,000 కోట్ల కంటే తక్కువే. 2018-19, 2017-18 మినహా.. దాదాపుగా ప్రతి ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని ప్రభుత్వం అందుకోలేదు. 2017-18లో రూ.1 లక్ష




కోట్లను ప్రభుత్వం అంచనా వేయగా.. రూ.1,00,056 కోట్లను సమీకరించింది. 2018-19లో రూ.80,000 కోట్లను అంచనా వేయగా.. రూ.84,972 కోట్లు పెట్టుబడుల ఉపసం హరణ ద్వారా ప్రభుత్వ ఖజానాకు వచ్చాయి.

# 70 వేలకు చేరిన బంగారం..



**జై భీమ్ న్యూస్, ప్రభాతసూర్యుడు**
బంగారం రోజురోజుకు భారీ షాక్ ఇస్తోంది. నిన్న ఒక్కరోజు స్థిరంగా ఉన్న బంగారం ధరలు మంగళవారం రూ.850 పెరగడంతో కొనుగోలుదారుల్లో ఆందోళన వ్యక్తమైంది.చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం ధరలు రూ.70,430 పలుకుతోంది. దీంతో సామాన్యులు బంగారం కొనేందుకు ముందుకు రావడం లేదు. అంతర్జాతీయంగా నేడు బంగారం స్పాట్ గోల్డ్ రేటు ఔన్స్ కు 2252 డాలర్లు పలుకుతోంది. సిల్వర్ రేటు ఔన్స్ కు 25.20 డాలర్లుగా ఉంది. ఈ నేపథ్యంలో దేశీయంగా బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే?బులియన్ మార్కెట్ ప్రకారం.. ఏప్రిల్ 2న ఓవరాల్ గా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.63,750గా నమోదైంది. 24 క్యారెట్ల పసిడి 10 గ్రాములకు రూ.69,530 గా ఉంది. ఏప్రిల్ 1న 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.62,900తో విక్రయించారు. 10 గ్రాముల బంగారానికి సోమవారంతో పోలిస్తే మంగళవారం 22 క్యారెట్ల 10 గ్రామలు రూ.850, 24 క్యారెట్ల 10 గ్రాములు 930 పెరిగాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.. న్యూఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.62,900 ఉండగా.. 24 క్యారెట్ల గోల్డ్ రూ.69,540 గా నమోదైంది.ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.63,610 కొనసాగుతోంది. 24 క్యారెట్లు రూ.69,390 పలుకుతోంది. చెన్నైలో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.64,560 పలుకుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.70,430తో విక్రయిస్తున్నారు. బెంగుళూరులో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.63,610 పలుకుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.69,390తో విక్రయిస్తున్నారు. హైదరాబాద్ లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.63,610తో విక్రయిస్తున్నారు. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.68,390తో విక్రయిస్తున్నారు. బంగారంతో పాటు వెండి ధరలు భారీగానే పెరిగాయి. మంగళవారం ఓవరాల్ గా కిలో వెండి రూ.78,600గా నమోదైంది. న్యూ ఢిల్లీలో కిలో వెండి రూ.78,600గా ఉంది. ముంబైలో రూ..78,600, చెన్నైలో రూ.81,600, బెంగుళూరులో 77,600, హైదరాబాద్ లో రూ.81,600తో విక్రయిస్తున్నారు.

# మారుతి కార్లపై భారీ డిస్కౌంట్స్..

**జై భీమ్ న్యూస్, ప్రభాతసూర్యుడు**




సాధారణంగా ఏదైనా వస్తువు కొనుగోలు చేయాలనుకుంటే వాటిపై డిస్కౌంట్ల గురించి చూస్తాం. ఇవి పండుగలు, ప్రత్యేక రోజుల్లోనే ఉంటాయి. కానీ కార్ల కంపెనీలు మాత్రం సాధారణ రోజుల్లోనూ భారీ డిస్కౌంట్లతో వెహికల్స్ ను విక్రయిస్తాయి. మొన్నటి వరకు ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు కొన్ని కార్లు భారీ డిస్కౌంట్లతో మార్కెట్లో హల్ చల్ చేశాయి. తాజాగా కొత్త ఆర్థిక సంవత్సరంలో మారుతి కంపెనీ కళ్లు చెదిరే ఆఫర్లతో ఆకర్షిస్తోంది. ఒక్కో కారుపై ఏకంగా రూ.60 వేలకు పైగా తగ్గింపును ప్రకటించడంతో వినియోగదారులు మారుతి కార్ల కోసం ఎగబడుతున్నారు. ఇంతకీ మారుతికి చెందిన ఏ కార్లు డిస్కౌంట్లతో రానున్నాయంటే? దేశంలో కార్ల ఉత్పత్తిల్లో అగ్రగామిగా నిలిచే కంపెనీల్లో మారుతి సుజుకి ఒకటి. దీని నుంచి ఇప్పటి వరకు వివిధ మోడళ్లు మార్కెట్లోకి వచ్చి ఆకర్షించాయి. అయితే ఇప్పటికే రిలీజ్ అయిన కొన్ని కార్లపై కంపెనీ డిస్కౌంట్లను ప్రకటించడం విశేషం. మారుతి కంపెనీ నుంచి రిలీజ్ అయిన వాటిలో వ్యాగన్ ఆర్ అత్యధికంగా విక్రయాలు జరుపుకుంది. అయితే ఎస్ ప్రెస్సో, సెలెరియో మాత్రం అమ్మకాల్లో వెనుకబడి ఉన్నాయి. వ్యాగన్ ఆర్ కారు ప్రస్తుతం మార్కెట్లో రూ.5.54 లక్షల నుంచి రూ.7.38 వరకు విక్రయిస్తున్నారు. ఇందులో పెట్రోల్ తో పాట సీఎన్ జీ వేరియంగ్ కూడా ఉంది. 88.5 బీహెచ్ పీ పవర్ ను, 113 ఎన్ ఎం టార్క్ ను ఉత్పత్తి చేస్తుంది. మాన్యువల్ గేర్ బాక్స్ తో పాటు ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ తో పనిచేస్తుంది. లీటర్ పెట్రోల్ కు 25.19 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది. దీనిపై రూ.66,000 వరకు డిస్కౌంట్ ప్రకటించారు. మారుతి నుంచి వచ్చిన ఆల్టో కె10 ధర రూ.3.99 లక్షల నుంచి రూ.5.96 వరకు విక్రయిస్తున్నారు. దీనిపై రూ.67 వేల ప్రయోజనాలు ఉండనున్నాయి. అలాగే ఎస్ ప్రెస్సో రూ.4.26 లక్షల నుంచి రూ.6.12 లక్షల వరకు విక్రయించనున్నారు. ఈ మోడల్ పై రూ.66,000 ప్రయోజనాలు అందించనున్నారు. ఇక సెలెరియో రూ.5.37 లక్షల నుంచి రూ.7.09 లక్షల వరకు విక్రయించనున్నారు. రూ.61,000 బెనిఫిట్స్ ఉండనున్నాయి.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215